# గిఫ్ట్ హ్యాంపర్

-కె.కె.భాగ్యశ్రీ

"ఇక్కడ సుజన కేరాఫ్ ఐరావతి ఎవరండీ?"

కాలింగ్ బెల్ మోగగానే తలుపు తెరిచిన రేవతిని అడిగాడు పోస్ట్‌మ్యాన్.

అతడికేసి ఓసారి తేరిపార చూసి "సుజన ఉండేది ఇక్కడేగానీ కేరాఫ్ అడ్రస్ మరోసారి చదవండి" అనుమానంగా నుదురు చిట్లించింది రేవతి.

అతడు అయోమయంగా బుర్ర గోక్కొని "ఇదిగో చూడండి... నేను కరెక్ట్‌గా చదివానో లేదో తెలుస్తుంది" ఆమె చేతికో పొడవాటి కవర్ అందించాడు.

కేరాఫ్ అన్నచోట ఇంగ్లీషులో ఐరావతి అని వ్రాసి ఉండడం చూసి మొదట ఆశ్చర్యపోయినా తరువాత అసలు విషయం గ్రహించి ముసిముసి నవ్వులు రువ్వింది రేవతి.

అసలే అడ్రస్ కోసం ఆ కాంప్లెక్స్‌లో ఉన్న అయిదారు బ్లాకులలోని అన్ని అంతస్తుల మెట్లు ఎక్కి ఎక్కి అలసిపోయి ఉన్నాడేమో, ఆమెగారి చిరునవ్వులు చిర్రెత్తించాయి పోస్ట్‌మ్యాన్‌కి. అతడి అదృష్టంకొద్దీ అక్కడ ఆ సమయంలో పవర్‌కట్ మూలాన లిఫ్ట్ పని చేయడంలేదు మరి.

ఒళ్లంతా ధారాపాతంగా చెమట్లు కారిపోతున్నాయి. అదేపనిగా ఎక్కడం దిగడంవలన కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి.

"ఇంతకీ ఈ కవర్ మీదేనా?" అడిగాడు కాస్త అసహనంగా.

"ఆ... మాదే" తాపీగా చెప్పింది రేవతి.

"ఆ మాట ముందే చెప్పొచ్చుకదా. అడ్రస్ మరోసారి చూసారెందుకు?"

"నా పేరు రేవతి. మా ఇంటి పేరు ఐ. రెండిటి మధ్య చుక్క లేకుండా వ్రాయడమే కాకుండా టైప్ చేసేటప్పుడు ఆర్ఇవిఎటిఐకి బదులుగా ఆర్ఎవిఎటిఐ అని టైప్ చేసారు. ఇంటి పేరుతోసహా కలిపి చదవడంవలన నా పేరు స్వరూపమే మారిపోయి ఐరావతిగా తయారైంది" నవ్వింది రేవతి.

"ఐ రేవతో, ఐరావతోగానీ నన్ను బ్రతికించారు. అరగంట నుంచి తిరగలేక ఛస్తున్నాను. ఈ మెట్లు ఎక్కి దిగేకన్నా వెంకన్నబాబు ఏడుకొండలు ఎక్కడం మహా తేలిక" అన్నాడు పోస్ట్‌మ్యాన్ అసలు అడ్రస్ కనిపెట్టగలిగానని మురిసిపోతూ.

"థాంక్స్ బాబూ... అనవసరంగా శ్రమపడ్డావు. ఈ ఏరియాకి కొత్తా? లోపలికిరా. ఏమైనా తీసుకుందువుగానీ" ఆదరంగా పిలిచింది రేవతి.

ఆపాటి మర్యాదకే పొంగిపోయాడు పోస్ట్‌మ్యాన్.

"ఏం వద్దమ్మా. కాసిని చల్లని మంచినీళ్లు ఇప్పించండి. గొంతు పొడారిపోయింది" అన్నాడు.

రేవతికి జాలివేసి మంచినీళ్లతోపాటు మజ్జిగ కూడా ఇచ్చింది.

"రక్షించారమ్మా. మాబోటివాళ్ల మీద ఈపాటి దయ చూపితే అంతేచాలు" అనేసి వెళ్లిపోయాడతడు.

అతడు వెళ్లాక విశ్రాంతిగా సోఫాలో కూర్చుని కవర్ ఓపెన్ చేసింది రేవతి. అందులోని సారాంశం చదవగానే ఆమె వదనం ధగధగాయమానంగా వెలిగిపోయింది.

ఆ లెటర్ మన టీవీ వాళ్ల దగ్గర్నుండి వచ్చింది.

వాళ్ళు నిర్వహిస్తున్న 'మైమరచి పాడుతా' ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు రావాల్సిందిగా సుజనకు ఆహ్వానం పంపారు.

'మైమరచి పాడుతా' సెలక్షన్ కోసం తను పాడిన పాటల క్యాసెట్‌ను పంపించింది సుజన సరదాగా. కానీ సెలెక్టవుతానని మాత్రం ఊహించలేదు.

ఆ కార్యక్రమాన్ని సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు శరవణన్ నిర్వహిస్తున్నాడు. చాలామంది ఔత్సాహిక గాయనీ గాయకులకు అతడి ఎదుట పాడాలన్నది ఒక కల. తన కల ఇప్పుడు నెరవేరడంతో సుజన ఆనందానికి అవధులులేవు. కొన్ని వేలమంది పాల్గొన్న ప్ర్యూటీనీలో తను ఎంపికయ్యానని తెలుసుకున్నాక ఆమెకు ఎంతో గర్వంగా అనిపించింది. అపార్ట్‌మెంట్స్ మొత్తానికి ఈ విషయం పాకిపోయి అందరూ సుజనను అభినందనల వర్షంలో తడిపేసారు. రేవతి భర్త గంగాధర్ ఆనందానికి అంతేలేదు.

"తప్పకుండా సుజన ప్రైజ్ కొట్టుకొస్తుంది" అంది పక్క ఫ్లాట్‌లో ఉండే పద్మిని.

"అవునవును. సుజనది కోకిల కంఠం" ఎదురుగా ఉండే ఎలిజబెత్ పొగిడింది.

"ప్రైజ్ రాకపోయినా ఫర్వాలేదండీ. శరవణన్ గారి ఎదుట పాడే సువర్ణావకాశం రావడమే మహా భాగ్యం" చెప్పింది రేవతి సంబరంగా.

"పార్టిసిపేట్స్ అందరికీ రకరకాల కంపెనీల నుండి గిఫ్ట్ హ్యాంపర్స్ అందుతాయి కదా. అవి మాత్రం తక్కువా?" తనకు తెలిసిన పరిజ్ఞానాన్ని ప్రదర్శించింది పద్మిని.

"అవునుగానీ. మాకుమాత్రం శరవణన్‌గారి చేతుల మీదుగా లభించే ప్రశంసాపత్రమే విలువైనది" అంది రేవతి.

"అదీ నిజమే" అంది ఎలిజబెత్.

అందరూ సుజనకు ఆల్ ద బెస్ట్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

వారందరి ప్రోత్సాహంతో ఎంతో ఆసక్తిగా పాటలు ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టింది సుజన.

★★★

అనుకున్న రోజు రానే వచ్చింది. ప్రోగ్రాం కోసమని ప్రత్యేకంగా డిజైన్ చేసిన డ్రెస్‌ను కొంది రేవతి. ఆ రోజుకి రెండురోజుల ముందే గంగాధర్ దంపతులు సుజనను తీసుకుని హైదరాబాద్‌లోని తమ స్నేహితుల ఇంటికి చేరుకున్నారు. ఒకరోజు రెస్ట్ తీసుకుని మర్నాడు ప్రోగ్రాం జరిగే ఒక ప్రముఖ సినిమా స్టూడియోకి బయలుదేరారు.

ఆ స్టూడియో ఇంచుమించు నగర శివార్లలో ఉంది. ఆటోవాలా మూడువందలు ఇస్తేగానీ రావన్నాడు. గీచి గీచి బేరం ఆడితే రెండువందల యాభైకి ఒప్పుకున్నాడు.

ప్రోగ్రాం జరగడానికి రెండు గంటల ముందే స్టూడియోలో హాజరై ఉండాలని టీవీ వారు తెలుపడంతో వేగమే అక్కడికి చేరుకున్నారు వారు.

'మైమరచి పాడుతా' ప్రోగ్రాం ఏ ఫ్లోర్‌లో జరుగుతోందో తెలుసుకుని అక్కడికి వెళ్లారు.


ఆ వాతావరణాన్ని చూసి అవాక్కయిపోయారు రేవతి, గంగాధర్‌లు. టీవీ స్క్రీన్‌మీద ఇంద్రలోకంలా భాసించే సెట్ అతి సామాన్యంగా ఉంది. పైగా అది లాస్ట్ ఫ్లోర్‌లో ఉండబట్టి అందునా రేకుల షెడ్డులో వేసిన సెట్ కాబట్టి అక్కడ చాలా వేడిగా

ఉంది. అక్కడక్కడ ఒక్కో ఫ్యాన్ తిరుగుతోంది. మండే సూర్యుడు తన ప్రతాపం చూపించే మే ఫైల కావడంతో ఉక్కపోత ఉడికించి పారేస్తోంది అందరినీ. వీళ్లలాగే ఆ రోజు కార్యక్రమంలో పాల్గొంటున్న మిగిలిన పిల్లలు, వారి తల్లిదండ్రులు అందరూ విచ్చేసి ఉన్నారు. అందరూ ఒకరినొకరు పరిచయాలు చేసుకుని ఆల్ ది బెస్ట్ చెప్పుకున్నారు. ఆర్కెస్ట్రాతో రిహార్సల్స్ చేయిస్తామన్నారు నిర్వాహకులు.

అలాగేనన్నారు పాడడానికి వచ్చినవారు.

రిహార్సల్స్ జరుగుతున్నంతసేపూ ఆ వేడిని తట్టుకోలేని పిల్లలు చెమట్లు క్రక్కారు. ఒక ఆడమనిషి చేత్తో టవల్ పట్టుకుని వారి చెమట్లను అద్దసాగింది. 'ఆ ఏర్పాటేదో బాగుంది' అనుకున్నారు అందరూ.

టీవీ స్క్రీన్‌మీద ఆ సెట్‌ను చూసి అదేదో ఏసి థియేటర్ అని భ్రమించినందుకు తమ మీద తమకే జాలివేసింది వారికి.



"ఇంతకీ ప్రోగ్రాం ఎప్పుడు స్టార్టవుతుంది?" ఆతృత ఆపుకోలేని గంగాధర్ అడిగాడు అక్కడ ఉన్న ప్రోగ్రాం మేనేజర్‌ని.

"అవుతుంది సార్. అంత తొందరైతే ఎలా? శరవణన్‌గారు రావడానికి టైమ్ పడుతుంది. ఆయనేమన్నా అల్లాటప్పా అనుకున్నారా? ఆయనకెన్ని పనులూ, ఎన్ని పాటలు... అన్నీ చూసుకురావాలికదా" అన్నాడతను ఇంచుమించు కరచినట్లే.

అప్పటికే ఎండ తీవ్రతకి అలసట మొదలైపోయింది అందరికీ. పిల్లల్లో ఉత్సాహం పోయి నిస్సత్తువ చోటు చేసుకుంది.

"అదిగో... శరవణన్ వచ్చేస్తున్నారు" అరిచారెవరో హుషారుగా.

బ్రతుకుజీవుడా అనుకున్నారు అందరూ. ప్రోగ్రాం మొదలయింది. ఒకానొక ప్రముఖ సంగీత విద్వాంసుడిని న్యాయనిర్ణేతగా ఆహ్వానించారు.

చిన్నారులు పాడుతుంటే వారి పాటల్లోని తప్పొప్పుల్ని సోదాహరణంగా ఎత్తిచూపి, చేయవలసిన సూచనలు చేసి వారిని ప్రోత్సహిస్తూ మధ్యమధ్య కొందరు సినీ ప్రముఖులను అనుకరిస్తూ కార్యక్రమం నిర్వహించసాగాడు శరవణన్.

అన్ని రౌండ్స్ పూర్తయ్యాయి.

సుజన బాగా పాడాలనే అనుకుంది. కానీ ఎక్కడో చిన్న పిసరు తాళం తప్పడం వలన రన్నరప్‌గా నిలిచింది. అయినా ఆమె నిరుత్సాహపడలేదు.

అంతటి గాయక శిఖామణి చేతులమీదుగా పురస్కారం పొందడమే తన ఆదృష్టంగా భావించింది.

వారిని ఆశీర్వదించి ప్రశంసాపత్రాలతోపాటు షీల్డ్‌లను అందించాడు శరవణన్.

గుడ్డిలో మెల్ల అన్నట్లు కొన్ని ప్రముఖ కంపెనీల వారు అనేక రకాల గిఫ్ట్ హ్యాంపర్స్ ప్రకటించారు. అవి ఎప్పుడు అందిస్తారని అడిగాడు గంగాధర్ ప్రోగ్రాం మేనేజర్‌ని.

"వారంరోజుల్లో ఇచ్చేస్తారు సార్" చెప్పాడతను.

"అయితే మేం మా ఇంటి అడ్రస్ ఇచ్చాంగా. అక్కడికి పంపించివేయండి" అన్నాడు గంగాధర్.

"అలా ఎందుకు సార్... స్వయంగా మీ చేతులతోనే బహుమతులను పుచ్చుకుని వెళ్లండి" అన్నాడు మేనేజర్.

"వారంరోజులపాటు మేమిక్కడ ఉండాలంటే ఎలా?" సందేహం వెలిబుచ్చాడు.

"వారంరోజులెంత సార్? ఎంచక్కా హైదరాబాద్‌లోని చూడవలసినవన్నీ చూసేయండి" ఉచిత సలహా పారేశాడతను.

"నీకేం బాబూ ఎన్ని కబుర్లయినా చెబుతావు? వెనకటికెవడో తనది కాకపోతే కాశీదాకా దేకమన్నాట్ట..." చిరాకేసి గొణుక్కున్నాడు గంగాధర్.

"ఏంటి సార్. ఏదో అంటున్నట్టున్నారు?" అనుమానంగా చూసాడు మేనేజర్.

"ఆహా ఏంలేదు..." తడబడ్డాడు గంగాధర్.

"మీరెక్కడ బస చేసారో అక్కడి ఫోన్ నెంబర్ ఇచ్చి వెళ్లండి. మావాళ్ళు మీకు ఫోన్ చేస్తారు. వచ్చి మీ గిఫ్ట్‌ని కలెక్ట్ చేసుకోవచ్చు" చెప్పాడతను.

తన ఫ్రెండ్ ఫోన్ నెంబర్‌తోపాటు తన సెల్ నెంబర్ కూడా ఇచ్చి బయటపడ్డాడు గంగాధర్.

"ఏ గిఫ్ట్ హ్యాంపర్స్ అవసరంలేదు. వెళ్లిపోదామా?" అడిగాడు కూతుర్ని.

"ఫస్ట్ ఎలాగూ రాలేదు నాన్నా. కనీసం వాళ్లిచ్చే గిఫ్ట్ అయినా తీసుకోనివ్వండి" గారాలు పోయింది సుజన.

"వ్రతం చెడ్డా ఫలితం దక్కాలి కదా. అలాగే చేద్దాం" కూతుర్ని బలపరిచింది రేవతి.

అయితే వారంరోజులపాటు స్నేహితుడి ఇంట్లో తిష్టవేసి అతడిని ఇబ్బంది పెట్టేందుకు మనస్కరించలేదు గంగాధర్‌కి.

అందుకే ఆ మర్నాడే హోటల్‌కి షిఫ్ట్ అయిపోయాడు మిత్రుడు ఎంత వారించినా వినకుండా.

***

చక్కగా నాలుగురోజులపాటు భాగ్యనగరంలో విహరించారు ఖర్చుకి వెనుకాడక.

"అనవసర ఖర్చు తగులుకుంది. డబ్బు మంచినీళ్లలా ఖర్చవుతోంది" రుసరుసలాడింది రేవతి.

"డబ్బును మంచినీళ్లతో పోల్చడం తప్పు. నీళ్లని ఎంత పొదుపుగా వాడుతున్నామో నీకు తెలియనిదికాదు" నవ్వాడు గంగాధర్.

"మంచి మంచి గిఫ్ట్ హ్యాంపర్స్ ఇస్తారమ్మా. లేకపోతే నాకు మాత్రం నాన్న చేత డబ్బు ఖర్చు పెట్టించడం సరదానా?" అంది సుజన.

"అవునోయ్. ఎంతలేదన్నా అయిదారు గిఫ్ట్ హాంపర్స్ ఇస్తారు. అవన్నీ కలిపి ఓ నాలుగైదు వేల రూపాయలు విలువ చేస్తాయి. ఇంత దూరం వచ్చి ఇలా షికార్లు చేసే అవకాశం మనకు ఇప్పట్లో కలగకపోవచ్చు కాబట్టి ఈ ఆనందం మనకు అదనపు రాబడి అవుతుంది. అవునా" అంటూ భార్యని ఊరడించాడు గంగాధర్.

ఇంతలో సెల్ మోగింది. అది గంగాధర్ ఫ్రెండ్ దగ్గర్నుంచి.

"ఒరేయ్ గంగూ! టీవీ వారి దగ్గర్నుంచి ఫోనొచ్చింది. అమ్మాయికి ఇస్తామన్న గిఫ్ట్ హాంపర్స్ అన్నీ రెడీగా ఉన్నాయిట. వచ్చి కలెక్ట్ చేసుకోమన్నారు" హడావుడిగా ఎవరో తరుముతున్నట్లుగా విషయం చెప్పేసి ఫోన్ కట్ చేసాడు మిత్రుడు.

"కాగల కార్యం గంధర్వులు తీర్చారన్నమాట. టీవీ వాళ్ళు ఫోన్ చేసారుట..." ఇంకా ఏదో చెప్పబోతుంటే మళ్లీ సెల్ మోగింది.

స్విచ్ ఆన్ చేయబోయేంతలో కట్ అయింది. ఇలా రెండుమూడుసార్లు అవడంతో డిస్‌ప్లేలో నెంబర్ చూసి తనే డయల్ చేసాడు గంగాధర్.

"హలో సర్. మేం టీవీ నుండి మాట్లాడుతున్నాం" కోయిల కంఠం పలికింది.

"చెప్పండి. ఫోన్ ఎందుకు కట్ చేసారు" అడిగాడు గంగాధర్.

"బిల్ ఎక్కువ అవుతుందని మేమే మీకు మిస్డ్ కాల్స్ ఇచ్చాం" గలగలా


## మంగోలియాలో నాటువైద్యం

ఈరోజుల్లో కూడా మంగోలియాలో నాటువైద్యం ఎక్కువగా జరుగుతోందిట. మెడనొప్పి పెట్టిన ఆడది అందమైన మగవాడి మోకాలికి తలాన్చి కూర్చుంటే చాలు నొప్పి తగ్గిపోతుందిట. బాగా రక్తపుపోటు ఉన్న వాళ్ళు ప్రక్కన పిల్లిని కూర్చోపెట్టుకుని దాన్ని దువ్వుతూ రెండు వెల్లుల్లి తునకల్ని నమిలితే చాలుట. పన్నుపోటు పెడితే ఏ జంతువు మూత్రాన్నైనా అప్లయ్ చేస్తారుట. రక్తపుపోటు తక్కువైతే అప్పుడే చంపిన మేక నెత్తుర్ని ఓ కప్పుడు త్రాగమంటారుట. గుర్రపు పాలు తోడు పెట్టిన పెరుగు 'ఆర్ట్'లో గుడ్డని ముంచి న్యూమోనియా వచ్చిన బిడ్డ గుండెలమీద వత్తితే చాలుట. ఆదేశంలోని ఆధునికులకి ఆ నాటువైద్యాలు పిచ్చి నమ్మకాలనిపించినా పిచ్చివాళ్లకి అరకప్పు వేడి వేడి నక్క మూత్రాన్ని పట్టిస్తే నయమవుతుందని నమ్మేవాళ్లింకా అక్కడున్నారు.

## పట్టుబడిన దొంగ

అలెక్సీ అమురిన్ కారు రోడ్డు మీద హఠాత్తుగా ఆగిపోతే దాన్ని రోడ్డు ప్రక్కకి త్రోసి పెట్టి సర్వీసువాళ్ళని పిలవడంలో సాయం చేసి పెట్టారు మాస్కో పోలీసులు. యధాలాపంగా కార్లోకి చూస్తే ఇగ్నిషన్‌కీ స్థానంలో స్క్రూడ్రైవర్ వాళ్లకి కనిపించిందింట. అనుమానం వచ్చి కారు నెంబర్ని చూస్తే అది చోరీ కాబడిన కారని వాళ్లకి తెలిసింది. దాంతో అనేక కార్లు దొంగిలించిన ఘరానా దొంగ అలెక్సీ ఆటకట్టయింది.

-తటవర్తి



నవ్వింది ఆమె.

"చెప్పండి మేడమ్" అన్నాడు లేని మర్యాదను బలవంతంగా గొంతులోకి రప్పించుకుని.

"మీకీపాటికి మెసేజ్ అందే వుంటుంది. 'మైమరచి పాడుతా'లో రెండవ స్థానంలో వచ్చినందుకు మీ అమ్మాయి సుజనకి చంద్ర మసాలావారి తరపున, ట్రిపుల్ వై డిటర్జంట్ సోప్ తరపున, మిలన్ కిడ్స్‌వేర్ తరపున..." ఇలా ఎన్నెన్నో గిఫ్టల లిస్ట్ చదవసాగింది ఆమె.

"సరే..సరే... మేం ఇప్పుడే వచ్చి కలెక్ట్ చేసుకుంటాం" అని ఫోన్ ఠక్కున కట్ చేసాడు గంగాధర్.

"నువ్వు రూమ్‌లో జాగ్రత్తగా ఉండు రేవతీ. నేను, సుజన వెళ్లి గిఫ్ట్స్ కలెక్ట్ చేసుకుంటాం" అన్నాడు గంగాధర్.

"అమ్మో... నాకు భయం. నేనూ వస్తాను" చకచకా తయారైపోతూ అంది రేవతి.

రానూపోనూ కలిపి ఆటో అయిదువందల రూపాయలకి మాట్లాడుకున్నారు.

ఒక గంట వెయిటింగ్ తరువాత టీవీవారు సుజనకి గిఫ్ట్ హ్యాంపర్స్ అందజేసారు.

అన్ని కంపెనీల వారు అందించిన బహుమతులు వెరసి ఒక అయిదారు వచ్చాయి.

సుజన ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యింది. రంగురంగుల కాగితాలతో ప్యాక్ చేసిన వాటని ముగ్గురూ కలిపి మోసి ఆటోలోకి చేర్చారు.

"చాలాసేపు వెయిట్ చేయించారు సార్. మీటర్‌మీద వందివ్వండి" డిమాండ్ చేసాడు తెలివిమీరిన ఆటోవాలా.

అన్ని కానుకలు పొందిన ఆనందంలో అలాగేనంటూ ఒప్పేసుకుని ఆరు వందలు సమర్పించుకున్నాడు గంగాధర్.

సుజన ఎంతో ఆతృతగా తనకు ఏ ఏ బహుమతులు వచ్చాయో చూసుకోవాలని ఆరాటపడుతోంది.

ముగ్గురూ మంచం మీద ఆ గిఫ్ట్‌ని పేర్చుకుని ఆ ప్యాకెట్లను విప్పడం మొదలుపెట్టారు.

పెద్దగా ఉన్న ఒక బాక్స్‌ని తీసి అందులో ఏ రైస్ కుక్కరో ఉంటుందని భావిస్తూ ఓపెన్ చేసాడు గంగాధర్. ఎన్నో రేపర్స్ విప్పదీసిన మీదట ఒక చిన్న అట్టడొక్కు బయటపడింది. అందులో చిన్నపిల్లలు చేతికి పెట్టుకునే చెవులపిల్లి మోడల్ రిస్ట్‌వాచ్ ఉంది. దాని విలువ మహా అయితే యాభై రూపాయలు వుంటుంది.

"ఇదా మనూర్లో పేవ్‌మెంట్స్ మీద పాతిక్కే దొరుకుతుంది" పెదవి విరిచింది రేవతి.

"ఆగాగు. అప్పుడే నిరుత్సాహపడకు. ఇంకా బోలెడు ఉన్నాయి" అంటూ మరో ప్యాకెట్ విప్పదీసాడు గంగాధర్.

దానిలో చంద్ర మసాలావారు స్పాన్సర్ చేసిన గోనెసంచిలాటి బ్యాగ్ ఉంది. దానిమీద సదరు మసాలా పొడి వారి లోగో ముద్రించబడి ఉంది.

"ఛీ.. ఇదా దీని ఖరీదు ఇరవై కూడా ఉండదు" చీదరించుకుంది రేవతి.

సుజన సరేసరి. అంతులేని ఆశాభంగం పొందినదానిలా ముఖం వ్రేలాడేసింది.

తప్పనిసరై మిగిలినవి కూడా ఓపెన్ చేసారు. అవీ అంతే. ఒకదానిలో చవకరకం హాట్‌బాక్స్, ఇంకోదానిలో డిటర్జెంట్ పౌడర్, నాలుగుసోపులు, మరోదానిలో డజను హ్యాండ్ కర్చీఫ్స్...అన్నీ పనికిమాలిన కానుకలున్నాయి.

వాటన్నిటి విలువ నాలుగువందలకు మించదు. ఈ పిచ్చి గిఫ్ట్ హ్యాంపర్స్ కోసం వారంరోజులపాటు తనెంత డబ్బు, సమయం కూడా వృధా చేసాడో తలచుకున్న గంగాధర్ గుండె గుభేలుమంది.

లాడ్జింగ్‌కి, విహారయాత్రలకి, తిండితిప్పలు, ఆటో ఖర్చులు అన్నీ కలుపుకుని పదివేల రూపాయలదాకా అయింది.

కానీ దక్కింది నిండా అయిదువందల రూపాయలు కూడా విలువ చేయని గిఫ్ట్ హ్యాంపర్స్.

విహారయాత్రవలన లభించిన ఆనందాన్ని మినహాయించినా ఈ బహుమతుల విలువకన్నా అతడికి వదిలిన సొమ్మే ఎక్కువ.

"వెధవ... ఈపాటికేనా అంత బిల్డప్ ఇచ్చాడు" ఆ ప్రోగ్రాం మేనేజర్‌మీద కారాలూ మిరియాలు నూరాడు గంగాధర్.

"ఏం చేస్తాం... మనకిలా డబ్బు ఖర్చయ్యే యోగం ఉంది" భర్తను ఓదార్చి కూతురి ఫీలింగ్స్ ఎలా ఉన్నాయో పరికించింది రేవతి.

డస్ట్‌బిన్ నిండా నిండిపోయిన ప్యాకింగ్ పేపర్స్‌వైపు నిర్వికారంగా చూస్తూ కూర్చుంది సుజన.

★



## సింప్లిసిటీ

తెలుగు ప్రేక్షకుల టేస్ట్‌కు తగ్గట్టుగా నటించడంలో అందెవేసిన చేయిగా మారిన స్నేహ ఇప్పుడు 'మనసు పలికే మౌనరాగం'తో జనాల హృదయాలను రంజింపచేసేందుకు సిద్ధమైంది. 'అమ్మాయి బాగుంది' సినిమా నిర్మాత దేవకుమార్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం మ్యూజిక్ ఈమధ్యే విడుదలయింది కూడా. తెలుగు ఇండస్ట్రీ ఈ చిత్రం విజయం కోసం తపిస్తోంది.

